క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లా సోలింగుర్‌లో 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన అండర్ -14 మినీ నేషనల్ టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్ షిప్ 2023 జట్టులో ఏపీ రెండో స్థానంలో నిలచింది. ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మిడుతూరు కేజీబీవీ స్కూల్ విద్యార్థిని అశ్విని ఉత్తమ ప్రతిభకనబరిచిందని ఇన్‌చార్జ్ ఎస్ఓ ఉమాగైర్వాణి తెలిపారు. సోమవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఎంఈఓ మౌలాలి టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడలో ప్రతిభ చూపిన అశ్వినిని, తర్ఫుదు ఇచ్చిన పీఈటీ సుమలతను అభినందించారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న రామసుబ్బయ్య

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం దక్కుతోందని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటాలో వడ్డెర కులానికి చెందిన చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చరిత్రలో తొలి సారి వడ్డెర్లకు చట్టసభలో అవకాశం కల్పించారని సీఎంను కొనియాడారు. టీడీపీలో వడ్డెరలకు ఒరిగిందేమి లేదని, వైఎస్సార్‌సీపీ పాలనలో సముచిత స్థానం దక్కిందని తెలిపారు. కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, పీఎంసీ చైర్మన్ షేక్షావలీ, నాయకులు శివలింగం, జంబులయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచారం



మండ్లెం గ్రామంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని సోమవారం జూపాడు బంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి మండ్లెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, ఆనంద్ రజక, కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


రైతు సంక్షేమమే సీఎం ధ్యేయం



పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో కాశీచంద్రమౌళీశ్వర స్వామి తిరునాల సందర్భంగా సోమవారం నిర్వహించిన అంతరాష్ట్ర న్యూకేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవియాదవ్ చైర్మన్, ఎంపీపీలతో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా శాప్ కోఆర్డినేటర్ రవికుమార్, శ్రీకాంత్, కోఆప్షన్ అబ్దుల్‌గఫార్, పబ్బతిరవి, ఓంకార్ రెడ్డి, నరేష్‌రెడ్డి, రమేష్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన పొట్టేళ్ల పందెం




పోటాపోటీగా తలబడుతున్న పొట్టేళ్లు

పగిడ్యాల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో భ్రమరాంబా మల్లికార్జున స్వామి, గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పొట్టేళ్ల పందెం పోటీలు చూపరులను అబ్బురపరిచాయి. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 15 పొట్టేళ్లు పాల్గొనగా మొదటి, మూడో స్థానాల్లో నాగటూరు ప్రశాంత్ పొట్టేళ్లు, రెండవ స్థానంలో మల్యాల శ్రీను పొట్టేలు నిలిచింది. విజేతలైన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదు బహుమతులు అందజేశారు.

నాడు వెలవెల.. నేడు కళకళ

- టీడీపీ హయాంలో కేసీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందని దుస్థితి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రెండు కార్లకూ సమృద్ధిగా నీరు
- జూలై నుంచి మార్చి నెలాఖరు దాకా సరఫరా
- పెరిగిన సాగు విస్తీర్ణం





రెండోకారు పంటకు గాను కేసీ కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న నీరు, కేసీ కాల్వ కింద రెండో కారు పంట(రబీ సీజన్) గా సాగుచేసిన మొక్కజొన్న

జూపాడుబంగ్లా: టీడీపీ పాలనలో కేసీ కాల్వకు సవ్యంగా నీరు అందక పంటలు సాగు చేసిన రైతులు రాత్రివేళల్లో జాగరణచేసి పంటలకు నీటిని పారించుకోవాల్సిన దుస్థితి ఉండేది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో కేసీ కాల్వకు సమృద్ధిగా సాగునీరు అందుతోంది. కాల్వకు నిరాటంకంగా నీరు సరఫరా అవుతుండటంతో ఆయకట్టు కింద రెండు కార్ల పంటలు పండించుకుంటూ అన్నదాతలు మెరుగైన దిగుబడులు సాధిస్తున్నారు. దీంతో కాల్వ కింద ఆయకట్టు సాగు విస్తీర్ణం కూడా పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జూలై నుంచే కాల్వకు నీరు

టీడీపీ పాలనలో ఆగస్టు రెండో వారంలో లేదా చివరలో కేసీ కాల్వకు సాగునీరు వచ్చేవి. అంతేకాకుండా వర్షాలు సక్రమంగా కురవకపోవటం వల్ల డ్యాంలలో గరిష్ట స్థాయి నీటి మట్టాల్లేక వారం బందీ ప్రకారం కేసీ కాల్వకు నీరు సరఫరా చేసేవారు. జగనన్న అధికారంలోకి వచ్చాక జూలై నెలలోనే కాల్వకు సాగు నీరు సరఫరా అవుతుండటంతో రైతులు ముందస్తుగానే పంటలు వేసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రకృతి అనుకూలించి వర్షాలు సమృద్ధిగా కురవడం జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉంటున్నాయి. అవసరం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా కూడా కాల్వకు నీరు విడుదల చేస్తున్నారు.

డివిజన్‌లో 19,100 ఎకరాల కేసీ ఆయకట్టు

సుంకేసుల డ్యాం నుంచి 0–120 కిలోమీటరు లాకిన్స్‌లా వరకు కేసీ కాల్వ అధికారుల లెక్కల ప్రకారంగా ఆయకట్టు, నానాయకట్టు కలిపి 35,000 ఎకరాలు సాగవుతుంది. కర్నూలు డివిజన్ పరిధిలో కోడుమూరు, కర్నూలు రూరల్, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు ప్రాంతాల్లోని రైతులు కేసీ కాల్వ నీటిని సద్వినియోగం చేసుకొని పంటలు పండించుకుంటున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారంగా 19,100 ఎకరాల కేసీ కాల్వ ఆయకట్టు సాగవుతుంది.

మూడేళ్లలో పెరిగిన సాగు విస్తీర్ణం

టీడీపీ పాలనలో కేసీ కాల్వకు సాగునీరు ఎప్పటి నుంచి ఎప్పటి దాకా వస్తుందో స్పష్టతలేక రైతులు పంటలు సాగుచేసుకోలేక పొలాలను బీళ్లుగా ఉంచుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాల్వకు జూలై నెలాఖరు నుంచి మార్చి నెలాఖరు దాకా సాగునీరు సరఫరా అవుతుంది. దీనిపై అధికారులు కూడా స్పష్టత ఇస్తుండటంతో ఆయకట్టుతో పాటు నానాయకట్టు రైతులు కూడా రెండుకార్ల పంటలు పండించుకుంటున్నారు. మూడేళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం 5వేల ఎకరాల దాకా సాగువిస్తీర్ణం పెరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రెండు కార్ల పంటలకు ఢోకాలేదు



మూడేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో కేసీ కాల్వ కింద సాగుచేసిన రెండో కారు పంటలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీరు ఢోకాలేకుండా పారించగలుగుతున్నాం. గతంలో రెండో కారు పంటకు వారం బందీ ప్రకారంగా సాగునీరు ఇచ్చేవాళ్లం. వర్షాలతో పాటు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఉన్నందువల్ల మరింత అధికంగా కేసీ కాల్వ ఆయకట్టుకు సాగునీరు అందించగలుగుతున్నాం. మూడేళ్ల క్రితంతో పోల్చితే ఆయకట్టు సాగు విస్తీర్ణం పెరిగింది.
–నరేష్, ఏఈ, కేసీకాల్వ

టీడీపీ పాలనలో రెండో పంటకు నీరందేది కాదు



టీడీపీ పాలనలో వర్షాలు సకాలంలో కురిసేవి కావు. అంతేకాకుండా కేసీ కాల్వకు సాగునీరు ఎప్పటి నుంచి ఎప్పటి దాకా వస్తుందో అర్థం అయ్యేది కాదు. రెండో పంటకు అస్సలు సాగునీరు అందేదికాదు. మూడేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో కేసీ కాల్వ కింద రెండుకార్ల పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది.
– శివానందరెడ్డి, పోతులపాడు

పుష్కలంగా నీరు



మూడేళ్ల నుంచి కేసీ కాల్వ కింద సాగుచేసిన పంటలకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది. ఏటా జూలై నెలాఖరులోగా సాగునీరు సరఫరా అవుతుండటంతో సకాలంలో ఖరీఫ్ పంటలు సాగుచేసుకోగలుగుతున్నాం. అలాగే రెండో పంటకు సాగునీటి లభ్యత విషయమై బెంగ తప్పింది. – దొడ్డా సుధాకర్, కనకయ్యకొట్టాల

రాష్ట్ర గవర్నర్‌కు ఘనస్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం సోమవారం శ్రీశైలం వచ్చారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంటలోని హెలిప్యాడ్‌కు ఉదయం 9.54 గంటల సమయంలో చేరుకున్నారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి విజయవాడకు బయల్దేరారు.

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



ఎల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామివార్లకు అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలను పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్చరణల మధ్య మన్యసుక్త హోమం చేపట్టారు. మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ భక్తుల మధ్య పల్లకీసేవ నిర్వహించారు. పొలగ్గారి బ్రదర్స్, తలముడిపి గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న బైరెడ్డిరాజశేఖరరెడ్డి కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు కోరారు. సోమవారం నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలు కాలనీలో నివాసగృహాలు ఏర్పాటు చేసుకొని 15 ఏళ్లుగా జీవిస్తున్నారని తెలిపారు. వారికి ఇప్పటిదాకా సరైన విద్యుత్ సౌకర్యం, తాగునీటివసతి, రోడ్లు, డ్రైనేజీల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. నాయకులు భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లు, పక్కీర్‌సాహెబ్, బెస్తరాజు, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలి

వెలుగోడు: గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని ఎంపీడీఓ షేక్ అమానుల్లా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు, ఎంప్లాయిస్ అటెండెన్స్, ఇంటి పన్ను, కుళాయి పన్నుల వసూళ్లపై చర్చించారు. ఉగాది నాటికి 300 ఇళ్లు పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

జూపాడుబంగ్లా: ఎల్‌కేజీ, యుకేజీ తరగతుల నిర్వహణకు అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న నారాయణ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యు డివిజన్ నాయకుడు మత్రిస్వామి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఎంఈఓ ఫైజున్నిసాకు వారు వినతిపత్రం అందజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఎల్‌కేజీ, యుకేజీ తరగతుల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమతుల్లేకుండా రూ.వేలకు వేలు ఫీజులు వసూళ్లు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు సాయిప్రకాశ్, వాసునాయుడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మహానందం.. ఆదిదంపతుల రథోత్సవం

- పెళ్లిపెద్దలతో కలిసి విహరించిన మహానందీశ్వరుడు



ఓంకార క్షేత్రంలో రథాన్ని లాగుతున్న భక్తులు



అశేష భక్తజనం మధ్య మహానందీశ్వరుడి రథోత్సవం

మహానంది: మహానంది క్షేత్రంలో వెలసిన మహానందీశ్వరుడి రథోత్సవం సోమవారం మహానందంగా సాగింది. రథాన్ని లాగేందుకు భక్తజనం పోటీపడ్డారు. వేలాది మంది భక్తులు హర హర మహాదేవ... శంభో శంకరా...శ్రీ మహానందీశ్వరస్వామికీ జై...శ్రీ కామేశ్వరీదేవి మాతాకీ జై....అంటూ శివనామస్మరణతో రథోత్సవం సాగింది. నంద్యాల స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్‌క్లాస్ ఆర్.రాంభూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి అర్చన, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి, డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దనశెట్టి, . ధర్మకర్తల మండలి సభ్యులు సోమవారం సాయంత్రం రథోత్సవాన్ని ప్రారంభించారు. మహానందీశ్వరస్వామి కల్యాణం అనంతరం శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి.. పెళ్లి పెద్దలైన శ్రీ పార్వతీ సహిత బ్రహ్మనందీశ్వర స్వామి వారితో కలిసి రథంలో ఆశీనులై ఆలయ పురవీధుల గుండా ఊరేగారు. రథం వద్ద వేదపండితులు విశేష ద్రవ్యాభిషేక పూజలు చేపట్టారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన వీరయ్య ఆచారి, నాగభూషణం ఆచారిలు కుంభాహుతిని సంప్రదాయంగా తీసుకుని వచ్చి రథానికి సమర్పించారు.

మహానందీశ్వరుడికి పుష్పశయనోత్సవం

రథోత్సవం అనంతరం సోమవారం రాత్రి శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామి దంపతులకు పుష్పశయనోత్సవం పూజలు వైభవంగా జరిగాయి. స్థానిక అలంకార మండపంలో చైర్మన్, ఈఓల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఓంకారంలో వైభవంగా రథోత్సవం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో సోమవారం సాయంత్రం ఆదిదంపతుల రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన వధూవరులైన శివుడు, పార్వతి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలను పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టింపజేశారు. వేడుకను తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఓంకార క్షేత్రానికి తరలి వచ్చారు. భక్తులు, టెంకాయలు కొట్టడంతో రథయాత్ర ప్రారంభమైంది. భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతూ ఓం హర..హర.. మహదేవా అంటూ భక్తి భావంతో క్షేత్రం చుట్టూ రథాన్ని తిప్పారు.

శ్రీకాశీచంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో వెలసిన శ్రీకాశీచంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పన్నీటిస్నానం చేయించి పట్టువస్త్రాలతో అలంకరించారు. పలురకాల పూలతో దేదీప్యమానంగా ముస్తాబుచేసిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలను కూర్చొండబెట్టి గ్రామ పురవీధుల్లో తిప్పారు. డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, నాయకులు చంద్రమౌళి, పబ్బతిరవి, తువ్వా శివరామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా యంత్రాంగానికి సన్మానం



అధికారులను సత్కరించిన ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ నుంచి సోమవారం వరకు భక్తజనానికి విశేషసేవలను అందించిన జిల్లా యంత్రాంగానికి దేవస్థానం ఈఓ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం దేవస్థాన పరిపాలనా భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా అధికారుల సేవలను కొనియాడారు. అనంతరం దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. ఈఓ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కలెక్టర్, ఎస్పీ తగు సూచనలు చేస్తూ ఉత్సవాలు విజయవంతం అవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. అన్నిశాఖల అధికారులు పరస్పర సహకారంతో విధులు నిర్వహించి ఉత్సవాల విజయవంతానికి దోహదపడ్డారని కొనియాడారు. అలాగే దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు, ఉత్సవాల నిర్వహణలో పూర్తి సహాయ సహకారాలను అందించారని చెప్పారు.

ఘనంగా శివాజీ జయంతి

జూపాడుబంగ్లా: హిందూ సామ్రాజ్య స్థాపనలో ఛత్రపతి శివాజీ పాత్ర అమోఘమని ఎస్‌హెచ్‌డీఎస్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని నందికొట్కూరు పట్టణ శివారులోని జమ్మిచెట్టు నుంచి కొత్తబస్టాండు, పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ హిందూధర్మసేన వ్యవస్థాపకులు గూడూరు శివారెడ్డి మాట్లాడుతూ 1630 ఫిబ్రవరిలో ఛత్రపతి శివాజీ జన్మించాడని తెలిపారు. మొఘల్ చక్రవర్తులను ఎదురించి హిందూ సామ్రాజ్య స్థానకు ఆయన ఎంతగానో కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో రామయ్యఆచారి, రాఘవేంద్ర, విజ్జి, శివనాగయ్య, వంశీకృష్ణ, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సేవలో..



రథోత్సవంలో సన్నాయి వాయిస్తున్న హేమలత

మహానంది: ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు గ్రామానికి చెందిన హేమలత నాదస్వరం నేర్చుకుని శుభకార్యాలకు వెళ్తూ వాయిస్తుంటుంది. కానీ మహానందీశ్వరస్వామి రథోత్సవం ముందు సేవచేయాలనున్న ఆమె కోరిక సోమవారం నెరవేరింది. ఆమె భక్తిని చూసిన భక్తులు, అధికారులు ఆమెను మెచ్చుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మిడుతూరు: జగనన్న లే -అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని రోళ్లపాడు జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయకుండా ఉగాదిలోపు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

నంద్యాల: ఈ నెల 21, 22 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారని ప్రెస్ అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర తిలక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు గెస్ట్ హౌస్‌కు చేరుకొని సీనియర్ జర్నలిస్టులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారని పేర్కొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు



ఇస్కాలలో జరిగిన పోటీల్లో బండ లాగుతున్న తుమ్మలూరు వృషభాలు



ఓంకారంలో పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో సీనియర్స్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో, జిల్లెల్లకు చెందిన గటిక నాగిరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచాయి. పెసరవాయికి చెందిన కలాం బాష వృషభాలు మూడో స్థానంలో, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సందీప్‌రెడ్డి ఎద్లు నాల్గో స్థానంలో, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నారాయణ వృషభాలు ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 70 వేలు, రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 25 వేలు, రూ. 15 వేలు నగదును అందజేశారు.

క్రిష్ణనంది క్షేత్రంలో..

క్రిష్ణనంది క్షేత్రంలో నిర్వహించిన నాలుగు పండ్ల విభాగంలో బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తపల్లెకు చెందిన సాయికుమార్ వృషభాలు మొదటి స్థానంలో, రుద్రవరానికి చెందిన గౌడు ఎద్దులు రెండో స్థానం, అప్పనపల్లి, దాసరపల్లి గ్రామాలకు చెందిన గురుచరణ్, శాంతయ్య వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. దాసరపల్లికి చెందిన లక్ష్మయ్య ఎద్దులు నాల్గవ స్థానంలో, బొల్లవరం, చెరుకుల పాడుకు చెందిన వెంకటేశ్వర్లు, హరిబాబు వృషభాలు 5వ స్థానం, సోమయాజుల పల్లెకు చెందిన మహేష్ ఎద్లు ఆరో స్థానంలో, సాంబవరానికి చెందిన ఉమర్‌బాషా వృషభాలు 7వ స్థానం, కాకనూరుకు చెందిన దావీదు వృషభాలు 8వ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 35 వేలు, రూ. 25 వేలు, రూ. 2 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు నగదును సర్పంచి పల్లె నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి నగదును అందజేశారు.

తుమ్మలూరు వృషభాల జయకేతనం

పాములపాడు: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని ఇస్కాల గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలబండ లాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రమౌళి ప్రారంభించారు. పోటీల్లో తుమ్మలూరుకు చెందిన సురేష్ వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.40,016 దక్కించుకున్నాయి. నందీశ్వర రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 9 జతల వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. రెండో బహుమతి పాములపాడు ఇబ్రహీం సాహెబ్ ఎద్దులు రూ.25,016, మూడో బహుమతి అబ్దుల్ సలాం వృషభాలు రూ.15,016, నాల్గవ బహుమతి మంగలంపల్లి బాలస్వామి ఎద్లు రూ. 10,016, ఐదో బహుమతి చెలిమిల్ల ప్రసాద్ వృషభాలు రూ.5,016, ఆరో బహుమతి బావాపురం బాలస్వామి ఎద్దులు రూ.3,016 నగదును దక్కించుకున్నాయి. విజేతలకు నందీశ్వర స్వామి రైతు కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు. పోటీలకు వ్యాఖ్యాతగా వేమారెడ్డి నిర్వహించారు.

విజేతలు గుంటూరు జిల్లా వృషభాలు

మహానంది: మహానందిలో సోమవారం జరిగిన సబ్ జూనియర్స్ వృషభాల బలప్రదర్శన పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా చిన్నకోమేర్లకు చెందిన కేఎస్ జయరామిరెడ్డి, కర్నూలు జిల్లా పందికోనకు చెందిన ఉప్పర సుందరప్ప వృషభాలు కంబైన్డ్‌గా ద్వితీయస్థానం సాధించాయి. కర్నూలు జిల్లా వల్కూర్ గ్రామానికి చెందిన తిరుమలేష్ వృషభాలు మూడోస్థానం, కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన భావినేని మల్లికార్జునరావు ఎద్దులు నాలుగో స్థానం, బాపట్ల జిల్లా పావులూరి వీరస్వామి చౌదరి ఎద్లు ఐదు, పల్నాడు జిల్లా వెలగాల హైమావతి వృషభాలు ఆరవస్థానంలో నిలిచాయి. మొదటి విజేతకు రూ. 75వేలను మాజీ ఎంపీపీ బసిరెడ్డి నాగభూపాల్‌రెడ్డి, పుల్లయ్యయాదవ్, బండి శ్రీనివాసులు, బండి నారాయణ నగదు అందించారు. అలాగే రెండో విజేతకు రూ. 60వేలను మాజీ ధర్మకర్త అల్లీనగరం బాలవెంకటరెడ్డి, మూడో స్థానంలో వారికి చింతకుంట్ల లక్ష్మీనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డిలు రూ. 50వేలు, నాలుగోస్థానంలో నిలిచిన ఎడ్ల యజమానులకు మహానంది మండల వైఎస్సార్‌సీపీ యువనేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని రూ. 40వేలు, ఐదోస్థానంలో వచ్చిన వారికి మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, వెంకటేశ్వర్లు కుమారుడు కుంచపు శ్రీనివాసులు నగదు బహుమతి అందించారు.